ఆత్మవిశ్వాసం విడిచిపెట్టవద్దు. మీరు చేసే సాధన మీద మీకు ఉన్న నమ్మకం విడిచిపెట్టవద్దు. ఏదో ఎల్లమ్మ అందని, పుల్లమ్మ అందని రకరకాల గొడవలలోనికి వెళ్ళవద్దు. ఎల్లమ్మ, పుల్లమ్మ మీకు మోక్షం ఇవ్వరు. మనలో అంతర్యామిగా ఉన్న ఈశ్వరుడే మనకు మోక్షం ఇస్తాడు. అందుచేత మీ నిదానంలో మీరు ఉండండి. మీరు స్లోగా, స్టడీగా ప్రయత్నం చేయండి, గమ్యాన్ని మర్చిపోవద్దు. మనం మనస్సు అనే జైలులో ఉన్నాము, అది ఎలా చెపితే అలా చేయటానికి అలవాటు పడిపోయాము. ఇలా మనస్సుకు పాలేరుతనం చేస్తూ ఏదోరోజున చనిపోతున్నాము. ఈ మనస్సు అనే జైలునుండి బయటకు వస్తే నువ్వు ఈ ప్రకృతిని దాటిపోతావు, అప్పుడు నీకు నిజమైన స్వేచ్ఛ, నిజమైన ఆనందం కలుగుతుంది. మనస్సును దాటి బయటకు వస్తే నువ్వు పదిలక్షల మంది మధ్యలో ఉన్నా ఒంటరిగా ఉన్నాను అనిపిస్తుంది. మనస్సు నుండి బయటకు రాకుండా నువ్వు గదిలో కూర్చుని తలుపులు వేసుకొన్నా నీ బుర్రనిండా అడివి మిగులుతుంది. అందుచేత మనస్సు అనే జైలునుండి బయటకు రావటానికి సిన్సియర్‌గా ప్రయత్నం చెయ్యి.

## (సద్గురు శ్రీ నాన్నగారి అనుగ్రహభాషణములు, 06-04-2009, మండపేట)

ప్రియమైన ఆత్మబంధువుల్లారా,

ఆంజనేయస్వామి అఖండ బ్రహ్మచారి, మహామేధావి, బుద్ధిమంతుడు, బలవంతుడు, వ్యాకరణ శాస్త్రవేత్త. ఆయనకు వ్యాకరణశాస్త్రంలో ఉన్న పరిజ్ఞానం చూసి రాముడు ఆశ్చర్యపోయాడు. ఆంజనేయస్వామిలో మనం నేర్చుకోవలసిన విషయాలు చాలా ఉన్నాయి. రామనామాన్ని ఆంజనేయస్వామి ప్రచారం చేసినంతగా ఎవరూ చేయలేదు. ఆంజనేయస్వామికి దేవుడి పని తప్పించి సొంతపని అంటూ ఏమీ లేదు. అహంకారాన్ని పోగొట్టుకోవటం తేలిక అని మీరు అనుకుంటున్నారు కాని అది మీరు అనుకున్నంత తేలిక కాదు. కుక్క తోక వంకర తీయటం ఎంత కష్టమో అహంకారాన్ని పోగొట్టుకోవటం అంత కష్టం అని రామకృష్ణ పరమహంస చెప్పారు. మనకి అహంకారం ఒకోసారి అణిగి ఉంటుంది. అప్పుడు అహంకారంలోంచి బయటకు వచ్చేసాము అని మనకి అనిపిస్తుంది. ఇలా అనుకొంటూ మనలను మనం మోసం చేసుకొంటున్నాము. అహంకారం భయంకరమైన క్రూర సర్పము అన్నారు ఆచార్యులవారు. ఒక మహాసర్పము వచ్చి మీ శరీరాన్ని చుట్టబెట్టుకుంటే మీరు దానిలో నుండి బయటకు రాగలరుకాని అహంకారంలో నుండి బయటకు రాలేరు అని చెప్పారు. కోరిక, కోపము, లోభిత్వము ఇవి నిన్ను చంపక ముందే వాటిని చంపేయి

అన్నారు శాస్త్రంలో. కోపాన్ని నువ్వు చంపలేవు అనుకో అదే వచ్చి ఏదోరోజున నిన్ను చంపేస్తుంది. కామాన్ని నువ్వు చంపలేవు అనుకో నిన్ను ఈ జన్మలో కాకపోయినా రాబోయే జన్మలోనైనా కాల్చివిడిచిపెడుతుంది. అసూయని కనుక నువ్వు చంపకపోతే అసూయవల్లే నువ్వు కాలిపోయి చచ్చిపోతావు. అందుచేత మనం సాధన చేసి వాటిని పోగొట్టుకోలేకపోతే అవే మనల్ని చంపేస్తాయి. మీరు సాధన దగ్గర శ్రద్ధగా ఉండాలి. శ్రద్ధగా ఉంటే మనకి మోక్షం వస్తుంది. అహంకారాన్ని జయించాలంటే తిండి దగ్గర చాలా జాగ్రత్తగా ఉండాలి. మానసికఆరోగ్యం, శారీరకఆరోగ్యం కాపాడుకోవాలి.

మనం ఇతరులను విమర్శించకూడదు, మనలను మనమే విమర్శించుకుంటూ ఉండాలి. ఇతరులను విమర్శించుట వలన మన మనస్సు పొల్యూట్ అయిపోతుంది. ఇతరులు బాగా చెడ్డవాళ్ళు అనుకో నీకు నష్టం ఏమిటి? నువ్వు బాగుపడు నిన్ను నువ్వు విమర్శించుకోవటం వల్ల నీకు తేజస్సు వస్తుంది, నీకు హృదయం యొక్క లోతులు పెరుగుతాయి. ఇతరుల్ని విమర్శిస్తూ కాలాన్ని పాడుచేసుకునేబదులు రోజుకొక మంచిపని చెయ్యి అప్పుడు నీ బుద్ధి నిర్మలమవుతుంది. పరమాత్మ గీతలో సంహరతే, సంహరతే అన్నాడు. తాబేలు తనకు ఏదేనా ప్రమాదం వచ్చినప్పుడు తన తలని, తన కాళ్లని లోపలికి ఎలాగ లాగేసుకుంటుందో అలాగే విషయాలమీదకి ఏ ఇంద్రియం పరిగెడుతోందో ఆ ఇంద్రియాన్ని బయటకు వెళ్ళనివ్వకుండా లోపలికి ఉపసంహరించు. బయటకు వెళ్ళనిస్తే అది విజృంభించేస్తుంది. మీరు ఇంద్రియాలను వెనక్కి లాక్కోండి. మీకు ఇంద్రియనిగ్రహం లేకుండా మనస్సుని నిగ్రహించుకుందామన్నా అది సాధ్యం కాదు. మీ ఇంద్రియాలని, మీ మనస్సుని నమ్మకండి అని కాళిదాసు చెప్పాడు. మీకు జున్ను ఇష్టం అనుకోండి. జున్ను కనిపించకపోతే మీరు తినరు. జున్ను కనిపిస్తే మీకు తెలియకుండా చెయ్యి అక్కడ పడిపోతుంది. ఎందుచేతనంటే మీకు లోపల ఆ వాసన ఉంది. జున్ను దొరికేటప్పటికి ఆ సంస్కారం తినేయమని చెబుతుంది. అటువంటి తిండి తినటం వలన ఇంద్రియాలు అపవిత్రం అయిపోతాయి, మనస్సు అపవిత్రం అయిపోతుంది, శరీరం అపవిత్రం అయిపోతుంది. మరల అందులో నుండి బయటకు రావటం బహుకష్టం. అందుకే పరమాత్మ సంహరతే అన్నాడు. మనస్సు ఏ ఇంద్రియం ద్వారా బయటకు వెళ్ళిపోతోందో చూసుకోండి. అక్కడ నుంచి మనస్సును విత్‌డ్రా చేయండి. అక్కడ నుంచి మీ మనస్సును విత్‌డ్రా చేయరనుకోండి మానసికఆరోగ్యం చెడిపోతుంది, శారీరకఆరోగ్యం చెడిపోతుంది. ఆచార్యులవారు అన్నారు ఇసుకలో నూనెపోస్తే ఆ నూనెను మళ్ళీ వెనక్కి తీసుకోగలరా? అలాగే మీ ఇంద్రియాలతోటి

ఎన్ని భోగాలు అనుభవించినా ఇసుకలో పోసిన నూనెలాంటిది అన్నారు. మళ్ళీ నువ్వు వాటిని తీసుకోలేవు. ఇవన్నీ జన్మాంతరంలో సంస్కారాలకింద మనస్సులో పడతాయి. ఒకసారి పని చేసామంటే అది అనుభవంలోనికి వచ్చేవరకూ ఆ కర్మ నిన్ను వెంటాడుతూ ఉంటుంది.

నీ శరీరాన్ని నువ్వు అనుకోవటం పెద్ద తప్పు. నువ్వు ఇంకో తప్పు చేస్తున్నావు ఇంట్లో వాళ్ళు అందరూ నువ్వు అనుకుని ఏడుస్తావు ఎందుకు అన్నారు ఆచార్యులవారు. అంటే మీ పిల్లలు మీరే, మీ మనవలు మీరే, మీ భర్త మీరే అందరూ మీరే ఇదేమి పద్ధతండి. మీ అబ్బాయికి జ్వరం వస్తే వైద్యం చేయించుకోండి అంతేకాని ఆ జ్వరం నీకు వచ్చేసినట్లు ఏడుస్తావేమిటి? వాడు నువ్వు ఎలాగ అవుతావు. నువ్వు పుట్టినప్పుడు వాడు వచ్చాడా? నువ్వు చనిపోతే వాడు నీకూడా వస్తాడా? మీ అబ్బాయి చచ్చిపోయినప్పుడు నువ్వు చచ్చిపోతావా? వాడే నువ్వు అనుకొని ఏడుస్తూ ఉంటే ఇంతకంటే పెద్ద మూర్ఖత్వం లేదు. దేహము నేను అనే తలంపుని పోగొట్టుకోవటం మానేసి అది నేను, ఇది నేను అని అనుకొంటూ దాని చుట్టూ తిరుగుతూ ఉంటే ఇంక అది ఎలా పోతుంది. నువ్వు సాధన చేసి దేహాత్మబుద్ధి వదిలించుకోవటం మానేసి దీనికి వచ్చే గొడవల్లోపడితే ఇది మహామాయ అన్నారు. మనం వెయ్యి కళ్ళతోటి చూసినా ఆ చీకటిని ఛేదించి వెలుగుని చూడలేము, అటువంటి కటికచీకటిలో మనం ఉన్నాము. అసలు మనకి విశ్లేషణ లేదు, వివేకం లేదు. ఈ అజ్ఞానంలోంచి నిన్ను మేలుకొలుపువాడు ఎవడూ లేడా? ఈ గాఢ అంధకారంలోంచి నిన్ను రక్షించేవాడు లేడా? మీ ఆయన మీకు బయట ఉన్నాడా లోపల ఉన్నాడా? బయటే ఉన్నాడు కదా బయట ఉన్న వాడిని బయటే ఉండనివ్వండి. గౌరవించండి వద్దనికాదు. మీ భర్తని లోపలవేసుకొని మొయ్యొద్దు. మీరు లోపల సత్యాన్వేషణలో ఉండండి. దేహప్రారబ్దాన్నిబట్టి భర్తఅని, భార్యఅని, సంతానం అని, ఐశ్వర్యం అని, దారిద్ర్యం అని ఇవన్నీ వస్తూ ఉంటాయి. ఇవన్నీ ఎలాగ వచ్చాయో అలాగే వెళ్ళిపోతాయి. ప్రారబ్దం అనుభవించే టైము వచ్చినప్పుడు నిన్ను మొట్టికాయలు మొట్టి నీచేత అనుభవింపచేస్తాడు. వాడు ఈశ్వరుడు.

నువ్వు జీవితం పొడుగునా సాధన చేసి, ప్రయత్నం చేసి రాగము, భయము, క్రోధము ఈ మూడింటిని విడిచిపెట్టు. రాగం అంటే కోరిక, రాగం అంటే మనకి మనుషుల మీద ఉన్న వ్యామోహం. మోహం చాలా ప్రమాదం. ఒక దుష్టుడిని మంచివాడని నమ్మి వాడి వెనకాల తిరుగుతున్నాము అనుకోండి వాడు మనకి చెడ్డ చేస్తే తప్పవాడిదికాదు. మనదే తప్పు ఎందుచేతనంటే వాడు దుష్టుడని గ్రహించలేకపోవటం వలన, మనకి వివేకం లేకపోవటం వలన మనం వాడి కూడా తిరుగుతున్నాము. మనం ఎక్కడ మోహపడకూడదో అక్కడే మోహపడతాము. వారే మనకి అశాంతిని తీసుకువస్తారు. అది అలా జరుగుతుందేమో, ఇది

ఇలా జరుగుతుందేమో అని ఊహించుకోవటం వల్ల భయం వస్తుంది. భయం వల్ల మీకు లోపల ఉన్న ఎనర్జీ తగ్గిపోతుంది. ఎక్కువ భయపడేవాడికి మరుపు వచ్చేస్తుంది. కోపం వచ్చిన వాడికి తొందరగా రోగం వచ్చేస్తుంది. రాగం, భయం, క్రోధం వీరే నిజమైన శత్రువులు. వీరు నీలోపలే ఉన్నారు. నీ అత్తగారు, నీ తోటికోడళ్ళు బయట ఉన్న శత్రువులు. వీరు నిన్నేమీ చేయలేరు. లోపలఉన్న శత్రువుల వలన నీకు ప్రమాదం. నువ్వు నారాయణ జపం చేసినా, రామజపం చేసినా, శంకరుడిని జపించినా నీ లోపల ఉన్న శత్రువులలోనుండి విడుదల పొందటమే నీ లక్ష్యం. జీవుడిని నువ్వే పవిత్రం చేసుకోవాలి. నిన్ను ఎవరో ఉద్ధరిస్తారని కనిపెట్టుకొని ఉండకు. నిన్ను నువ్వు ఉద్ధరించుకొంటూ ఉంటే భగవంతుడి సహాయం, గురువు సహాయం నీకు వస్తుంది. నువ్వు సాధన విడిచిపెట్టకుండా ఉంటే, శ్రద్ధ విడిచిపెట్టకుండా ఉంటే, ఈశ్వరుడి మీద విశ్వాసం విడిచిపెట్టకుండా ఉంటే దేవుడు వచ్చి నీ శరీరాన్ని, నీ మనస్సుని ముట్టుకుంటాడు. అప్పడు ఈ కామాలు, ఈ క్రోధాలు, రాగద్వేషాలు అన్నీ ప్రవాహంలో గడ్డిపరక కొట్టుకుపోయినట్టు అన్నీ కొట్టుకుపోతాయి. గాడ్స్ టచ్ వచ్చేవరకూ మీరు ఓర్పుగా సాధన విడిచిపెట్టకూడదు. మీరు ప్రపంచం గొడవలలోనికి ఎక్కువ వెడితే మీ మనస్సు నెమ్మదిగా పాయిజన్ అయిపోతుంది. అందుచేత మీరు భగవంతుడు చెప్పిన మాటని ప్రమాణంగా పెట్టుకొని, జీవిస్తూ ఉంటే గాడ్స్‌టచ్ వస్తుంది. గాడ్స్‌టచ్ వచ్చిందా మీరు పరమపవిత్రులు అయిపోతారు. మీకు వెయ్యికోట్ల జన్మలు తీసుకొని వచ్చే వాసనలు, పాపాలు ఉన్నా అవన్నీ కాలిబూడిద అయిపోతాయి. మీరు ప్రయత్నం చేస్తూ ఉండాలి. ఎదురు చూచినట్టు ఉండకూడదు. ఓర్పు వదిలిపెట్టకూడదు. అది ఎప్పడు వస్తుందో ముహూర్తం ఆయన పెట్టుకుంటాడు. భగవంతుడు ఆయన ఒడిలోకి మనల్ని తీసుకున్నాడంటే మన పని పూర్తయిపోయినట్లే.

జీవుడిని పరమపవిత్రం చేసే నామం రామనామం. శివుడు కాశీలో ప్రాణం పోయేవాళ్ళ చెవిలో రామమంత్రం ఉపదేశిస్తాడు. ఆ మంత్రం ఏమిటంటే "రాం రామాయనమః" దీనిని తారకమంత్రం అంటారు. అంటే జీవుడిని తరింపచేసే మంత్రం. వాల్మీకి చెప్తాడు ఆకాశంలో నక్షత్రాలని లెక్కపెట్టవచ్చు, ఇసుకగుట్టలో కూర్చొని ఇసుక రేణువులని లెక్కపెట్టవచ్చు కానీ రాముడి యొక్క సుగుణాలని లెక్కపెట్టలేము. రాముడిలో ఫలానా గుణం లేదని చెప్పలేము. తులసీదాసు అన్నాడు మీరు రామా అని కూడా అనక్కర్లేదు "రాం" అనండి సరిపోతుంది మీరు పవిత్రులు అయిపోతారు అన్నాడు. రాముడు పరిపాలన నిర్మలంగా ఉంటుంది, నిశ్చలంగా ఉంటుంది. రాముడు పరిపాలన చేసినా రాముడు చేత మనం పరిపాలించబడుతున్నాము అనే తలంపు

లేకుండా పరిపాలన చేస్తాడు వాడు రాముడు. ఇంద్రియచాపల్యంలో నుండి మనస్సు యొక్క చాపల్యంలో నుండి జీవుడిని బయటకి తీసుకువచ్చేది రామనామం. శివుడు అంటే జ్ఞానమని, అమ్మవారు అంటే శక్తి అని మనం అనుకుంటాము. జ్ఞానము, శక్తి కలిపిన దేవుడు రాముడు అని శివుడు చెప్పాడు. శ్రద్ధ లేకపోతే మనకి జ్ఞానం కలగదు. మన దగ్గర ఉన్న డబ్బువలన, మనకి ఉన్న చదువు వలన, మనకి ఉన్న గౌరవం వలన మనకి మోక్షం రాదు. పరమేశ్వరుడి పాదాల పట్ల మనకి ఉన్న భక్తివల్ల మటుకే ముక్తి సాధ్యం, భక్తిలేకుండా ముక్తి ఎవరికీ సాధ్యం కాదు. మన భక్తులకు కూడా భక్తి తక్కువే, మేము జ్ఞానులు అయిపోయాము అనుకుంటున్నారు. ఒక్కరికి దేహబుద్ధిపోలేదు, అంతర్దృష్టిలేదు. భగవాన్ అన్నారు అందరూ గజఈతగాళ్లేకాని ఒక్కరు కూడా గజం కదలటంలేదు అన్నారు. మనకి భక్తిలేకపోయినా భక్తి ఉందని మనలను మనం వంచన చేసుకోవటం ఇది ఆత్మవంచన అని పరమాత్మ అన్నాడు. ఆత్మస్తుతి, పరనింద తప్పించి మనకి ఇంకోటి చేతకాదు. ఏసుక్రీస్తు అన్నాడు ఎదుటివారిలో ఉన్న మంచి చూస్తే మీరు బాగుపడతారు. ఎదుటి వారిలో ఉన్న చెడ్డ చూస్తే మీరు చెడిపోతారు. మిమ్మల్ని మీరు విమర్శ చేసుకొంటూ ఉంటే మీరు బాగుపడతారు అన్నాడు ఏసు. రాముడికి అన్ని శక్తులు ఉన్నాయి, అన్ని కళ్యాణగుణాలు ఉన్నాయి, ఆధ్యాత్మికశక్తి ఉంది, భౌతికశక్తి ఉంది. అన్ని శక్తులు ఉండి అణిగి ఉంటాడు. ఇది మనం రాముడిని చూచి నేర్చుకోవాలి. మనకి ఏమీలేదు కాబట్టి ఎగిరి, ఎగిరి పడతాము. నేను శాస్త్రాలు అన్నీ చదివినా, చదవకపోయినా నాకు రామనామం ఒక్కటే చాలు, మనం నదిని దాటాలంటే బోటు సహాయం ఉండాలి. అలాగే రామనామం సహాయంతో నేను శాంతిని, ఆనందాన్ని పొందుతున్నాను అని గాంధీగారు అన్నారు.

కృతయుగంలో, త్రేతాయుగంలో ఎక్కువ ధ్యానాలు, తపస్సులు చేసేవారు ద్వాపరయుగం వచ్చేటప్పటికి ఎక్కువ యజ్ఞాలు, యాగాలు, దేవతల్ని ఆరాధించేవారు. ఈ కలియుగంలో రామనామం సరిపోతుంది. ఇంకేమీ చేయనక్కరలేదు అని ఆంజనేయస్వామి అన్నాడు. కలిలో ఎంతదోషం ఉందో అంతమంచి కూడా ఉంది. మీరు యజ్ఞాలు, యాగాలు చెయ్యకపోయినా రామనామం శ్రద్ధగా చేస్తే మీరు తరిస్తారు అన్నాడు. రామనామం మీ బలహీనతల్ని ఎత్తి చూపుతుంది అంతేకాదు మీలో ఉన్న అపవిత్రతనంతా బయటకులాగి మంటపెట్టి దహనం చేస్తుంది. అంటే మీకు పునర్జన్మ హేతువులు ఏవి ఉన్నా రామనామం యొక్క అగ్ని దహించి విడిచిపెడుతుంది. అదీ రామనామం యొక్క వైభవం. రాముడిని నమ్ముకుని కోతులే తరించినవి, మరి మనం ఎందుకు తరించము. రాముడు రామాయణ కాలంలో వారిని రక్షించాడు, వీరిని రక్షించాడు అని చెప్పకుంటున్నారు. రాముడు ఇప్పడు

శరీరంతోటి లేకపోయినా రామనామం స్మరించి కోట్లాదిమంది ఆత్మజ్ఞానం సంపాదించారు. రాముడి రూపంకంటే రాముడి నామం గొప్పది అని ఆంజనేయస్వామి చెప్పాడు. కొంతమంది వైష్ణవులకి రాముడి అంటే చాలా ఇష్టం. ఒక్కసారి రామనామం చేస్తే ఇంక రెండోసారి ఎందుకండి అంటారు. అదీ వారి నమ్మకం. రామాయణం చదివేటప్పుడు రాముడు దుఃఖపడిన ఆ ఘట్టాలు వదిలేయండి, ఎందుచేతనంటే పెరుమాళ్ళ దుఃఖం మేము భరించలేము అంటారు. వారు రామభక్తులు. మధ్వాచార్యులు అన్నారు భక్తి అనేది పెద్దపులి. పులి దగ్గరకి మేకలు, గొఱ్ఱెలు వస్తాయా! అలాగే భక్తి ఉన్న చోటికి విషయచింతన వస్తుందా? విషయచింతన వచ్చాక వదిలించుకోవటంకాదు భక్తి ఉన్న చోటకు అసలు విషయాలు రానేరావు. రాముడు మన హృదయంలో ఉన్నప్పడు సెన్సేకాని ఇంక నాన్‌సెన్స్ ఉండదు. వాడు రాముడు.

యజ్ఞ, దాన, తపస్సులను మనం ప్రాణం పోయేవరకూ విడిచిపెట్టకూడదు. స్వార్థం లేకుండా పని చేయటం యజ్ఞం. గౌరవంకోసం మనిషి పని చేస్తూఉంటే వాడు నీచాతి నీచుడు. భగవంతుడి ప్రీతికోసం పనిచేస్తేవాడు ఉత్తమోత్తముడు అది యజ్ఞం. తపస్సు అంటే మనస్సుని ఎండింపచేయటం. ప్రారబ్దాన్నిబట్టి మీకు గౌరవం వస్తుంది, అగౌరవం వస్తుంది ప్రారబ్దాన్ని సహించ కలగటం తపస్సు. తపస్సు చేయటం వల్ల హృదయం యొక్క లోతులు పెరుగుతాయి. మీకు ఏ వస్తువు అయితే బాగా ఇష్టమో దానిని తినటం మానేయాలి. ఆ వస్తువుని పూర్తిగా తినటం మానేయగల్గితే అది తపస్సు. అంటే మీ మనస్సులో ఉన్న ఇష్టాన్ని తపింపచేస్తున్నారు, ఎండబెడుతున్నారు. అన్నము మానేయటం తపస్సుకాదు. మీకు ఏ బలహీనత అయితే ఉందో ఆ బలహీనత పోవటం కోసం మనస్సుని ఎండబెడితే అదీ తపస్సు. నువ్వు ఏది కాదో అందులో నుండి విడుదలపొందటానికి నువ్వు చేసే ప్రయత్నం అంతా తపస్సు అని భగవాన్ అన్నారు. రామకృష్ణ పరమహంసగారు ఏమి అన్నారంటే మిమ్మల్ని రంపంపెట్టి కోసినా ఈ నేను అనే తలంపు పోదు. మీరు నూటికి నూరుపాళ్ళ భగవదనుభవంలో ఉన్నప్పడే నేను అనే తలంపు పోతుంది కాని అంత తేలికగా అది పోదు అది పోయినట్టు అనిపిస్తుంది అన్నాడు రామకృష్ణుడు. అహంకార రహితమైన, మమకార రహితమైన స్థితిలో ఏ సుఖాన్ని అయితే నువ్వు పొందావో, ఏ శాంతిని, ఏ ఆనందాన్ని నువ్వు పొందావో దానితోటి పోల్చదగిన ఆనందం ఈ లోకంలోకాని, పరలోకంలోగాని, వైకుంఠంలోకూడా లేదని నీకు తెలుస్తుంది. అది అనుభవైకవేద్యం అన్నాడు పరమాత్మ.

ఆత్మసుఖం నేను కొంత రుచి చూసాక సంసారులతోటి స్నేహం చెయ్యాలనిపించటం లేదు, వాళ్ళు కనిపిస్తే నాకు మాట్లాడాలని అనిపించటం లేదు అని వివేకానందుడు ఒకసారి రామకృష్ణుడు దగ్గర అంటాడు. అంత దూరం వెళ్ళిపోకు ఈ సంసారుల మధ్య నువ్వు కొంతపని చేయాలి. ఆ పని జరగనియ్యి. నాపని చేయటానికి నువ్వు వచ్చావు. నీకు సొంతపని లేదు అంటాడు రామకృష్ణుడు. రాముడికి ఆంజనేయస్వామి ఎటువంటివాడో రామకృష్ణుడికి స్వామీజీ అటువంటివాడు. అమెరికాలో స్వామీజీతోటి ఏమన్నారంటే మీ గురువులో ఏమీలేదు. మీ గురువుకంటే మీరే గొప్పవారు అన్నారు. మనం అయితే ఆ మాటలు భుజాన వేసుకొంటాము కాని స్వామీజీ ఆ మాటలను భుజాన వేసుకోలేదు. అప్పుడు స్వామీజీ అంటాడు కలకత్తా కాలేజీలో చదువుతూ, ఆ రోడ్లమీద తిరిగేపిల్లవాడిని తీసుకొనివచ్చి, దేవుడు లేడని అనేకమందితో వాదించినటువంటి ఈ కుర్రవాడిని చేరదీసి ఓ సెయింట్‌కింద తయారుచేసాడు. అంత గొప్పవాడు నా గురువు రామకృష్ణుడు. నా గురువు అనుగ్రహం ఉంటే మీరు ఏ వివేకానందుడు చాలా గొప్పవాడు అనుకుంటున్నారో, అటువంటివారిని వెయ్యిమందిని ఆయన స్మరించి అప్పటికప్పుడు తయారుచేయగలడు వాడు నా గురువు అని స్వామీజీ చెప్పాడు. ఈ మాయ అనే సాగరాన్ని దాటటానికి ఒక్క భక్తి చాలు. నిరంతరము భగవంతుడి పాదాలని పట్టుకొని ఉండటమే భక్తుడి లక్షణం. నువ్వు నిరంతరం గతాన్ని తలపెట్టుకొంటూ, భవిష్యత్ గురించి ఊహించుకొంటూ ఉంటే నీ భక్తి ఎలా నిలబడుతుంది అసలు నిలబడదు. ఈశ్వరుడి పాదాల యందు భక్తిచాలు మీరు ముక్తి పొందటానికి. భగవంతుడిని భగవంతుడి కోసమే ప్రార్థించు, ప్రేమించు, భగవంతుడి కోసమే నువ్వు భక్తి చెల్లించు, అదీ ఆంజనేయస్వామి సందేశం. నీకు దేహాభిమానం ఉన్నంతకాలం రాముడికి నౌకరుని అనుకో, రాముడి పని చెయ్యి. మీ భర్తే మీకు యజమాని అనుకున్నప్పుడు ఈ సృష్టికి కర్త అయినటువంటి రాముడు మీకు యజమానికాదా, మావారు చెప్పారు అని మీరు చేస్తున్నారు రైటే వద్దనటంలేదు. మరి అసలువాడు చెబితే వాడి మాటలు మీరు వినరా? వాడు మీకు ప్రభువుకాదా, ఏదో నాలుగు రూపాయిలు సంపాదించి మీకు సాపాటు పడేస్తున్నాడు వీడి మాటకే ఇంత విలువ ఇస్తూ ఉంటే అసలు సర్వజ్ఞుడు, సర్వశక్తిమంతుడు, సృష్టికి ప్రభువు అయిన వాడి మాటను మీరు గౌరవించారా అని ఆంజనేయస్వామి అడుగుతున్నాడు. చాలామంది మాకు శనిపట్టుకుందని అంటారు. ఆ శని ఆంజనేయస్వామి దగ్గరకి మాత్రము వెళ్ళదు. వాడు అతిబలవాన్.